తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
13 అక్టోబర్ 2026



## నార్లపూర్ పంపు ప్రారంభించి రైతులను ఆదుకోవాలి

- ఒకటి, రెండు రోజుల్లో పంపు ప్రారంభించకపోతే ? కార్యాచరణ
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



**వనపర్తి రూరల్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన నార్లపూర్ రిజర్వాయర్, పంపుహౌస్ సిద్ధంగా ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి సోమవారం నార్లపూర్ రిజర్వాయర్‌ను సందర్శించిన ఆయన, ఒకటి రెండు రోజుల్లో పంపు ప్రారంభించకపోతే రైతుల పక్షాన కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.
నార్లపూర్ పంపుహౌస్‌లో 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు మోటార్లు సిద్ధంగా ఉన్నాయని, రిజర్వాయర్‌లో 3.5 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలిపారు. ఒక్క పంపు నడిపినా 800 నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని వినియోగించి వానాకాలం పంటలను కాపాడవచ్చన్నారు. పంపుల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉన్నప్పటికీ, 24 గంటల విద్యుత్ సరఫరాపై జిల్లా మంత్రులు దృష్టి సారించడం లేదని ఆరోపించారు.

## వనపర్తి ఛాంపియన్‌షిప్ కప్-2026కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అక్టోబర్ 16, 17 తేదీల్లో జిల్లా స్థాయి క్రీడా సంబరాలు
- ప్రతి మండలం నుంచి ప్రతిభావంతులకు అవకాశం: కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి, అక్టోబర్ 12 (జనంసాక్షి):** దసరా పండుగను పురస్కరించుకొని వనపర్తి జిల్లాలో తొలిసారిగా అక్టోబర్ 16, 17 తేదీల్లో నిర్వహించనున్న వనపర్తి ఛాంపియన్‌షిప్ కప్-2026 క్రీడా సంబరాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. సోమవారం తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సూచనలు చేశారు. క్రీడా మైదానాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, పాల్గొనే క్రీడాకారులకు భోజనం, టాయిలెట్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రజలకు పోటీల వివరాలు తెలియజేసేందుకు మైకుసెట్లు, స్పీకర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండలం నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని కలెక్టర్ తెలిపారు. ఏడు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి ఉత్తమ జట్టును ఛాంపియన్‌గా ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులను వెలికితీయడంతోపాటు యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.

**అక్టోబర్ 16న ప్రారంభ వేడుకలు...**

అక్టోబర్ 16న ఉదయం వనపర్తిలోని ప్రభుత్వ కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ప్రారంభ వేడుకలు నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్ పోటీలు జరగనున్నాయి.

**విజేతలకు నగదు బహుమతులు...**

జట్టు క్రీడల్లో మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో, నాలుగో బహుమతులుగా రూ.5 వేల చొప్పున అందించనున్నారు. వ్యక్తిగత క్రీడల్లో మొదటి బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.3 వేలు, మూడో, నాలుగో బహుమతులుగా రూ.1,500 చొప్పున ఇవ్వనున్నారు. పాల్గొనాలనుకునే క్రీడాకారులు మండల స్థాయి సెలక్షన్ కమిటీలను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు, యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మండల క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- ప్రజావాణికి 101 పిర్యాదుల స్వీకరణ



**మహబూబ్ నగర్ బ్యూరో అక్టోబర్ 12(జనంసాక్షి):** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులకు ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను కలెక్టర్ సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు.



అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు.
ప్రజావాణిలో పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్లు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , మైనింగ్, అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 101 వినతులను అధికారులు స్వీకరించారు.
ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ డి.ఆర్.ఓ ఎ. నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్. పి. సి. ఈ.ఓ, ఇంచార్జి డి. పి. ఓ వెంకట రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త కమాండెంట్‌గా అలెక్స్



**ఎర్రవల్లి, అక్టోబర్ 12(జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లిలోని తెలంగాణ స్పెషల్ పోలీస్ (TGSP) 10వ బెటాలియన్ కొత్త కమాండెంట్‌గా టి. అలెక్స్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్-చార్జ్ కమాండెంట్ ఆదినారాయణ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం బెటాలియన్ అధికారులతో సమావేశమై విధులు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

### గద్వాలలో సందడి చేసిన
## సినీ హీరోయిన్ రితికా నాయక్



**గద్వాల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది చెన్నై షాపింగ్ కార్యక్రమంలో 'మిరాయి' సినిమా హీరోయిన్ రితికా నాయక్ పాల్గొని సందడి చేశారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు విచ్చేసిన ఆమె, మాల్లోని వివిధ విభాగాలను పరిశీలిస్తూ సందడి చేయగా, ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా అభిమానులతో ముచ్చటిస్తూ, వారితో కలిసి ఉత్సాహంగా సెల్ఫీలు దిగారు.
మాల్ జ్యోతి ప్రజ్వలన అనంతరం రితికా నాయక్ మాట్లాడుతూ వారసత్వ నగరమైన గద్వాల లో ది చెన్నై షాపింగ్ మాల్ 40వ శాఖను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ దసరా, దీపావళి పండుగ సీజన్ కోసం సరికొత్త కలెక్షన్లు, అధునాతన డిజైన్లు ఒకే చోట అందుబాటులోకి రావడం ఇక్కడి ప్రజలకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

- పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్



**వనపర్తి, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భీమ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం వనపర్తి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా భీమ్యా నాయక్ మాట్లాడుతూ, అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి, తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారులకు తెలియజేయాలని సూచించారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, తమ శాఖ పరిధిలో లేని ఫిర్యాదులను సంబంధిత శాఖలకు లేఖ ద్వారా పంపించాలని ఆదేశించారు.

### ఫిర్యాదులపై తక్షణమే
## స్పందించి బాధితులకు న్యాయం చేయాలి

- పోలీసు అధికారులకు ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాలు



**వనపర్తి, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై పోలీసు అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ ఆదేశించారు.
సోమవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 10 మంది ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును స్వయంగా పరిశీలించి, సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.
ఫిర్యాదులపై వెంటనే విచారణ చేపట్టి, చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ రోజు ప్రజావాణిలో అందిన 10 ఫిర్యాదుల్లో ఒకటి భార్యాభర్తల మధ్య వివాదానికి, రెండు భూతగాదాలకు, మరో ఏడు పరస్పర గొడవలకు సంబంధించినవిగా ఉన్నాయి.
ఫిర్యాదులపై ఎస్పీ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకం కలిగిందని ఫిర్యాదుదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు...

• బోర్ల ఏర్పాటుకు రూ.15 లక్షలు, బతుకమ్మ వేడుకలకు రూ.30 లక్షలు
• ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు.. స్వీపింగ్ మిషన్ ప్రారంభం



**సంగారెడ్డి, అక్టోబర్ 12 (జనంసాక్షి):** సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ కూన వనిత సంతోష్ అధ్యక్షతన సోమవారం సాధారణ మున్సిపల్ సమావేశం నిర్వహించారు. మొత్తం 37 అంశాలతో కూడిన ఎజెండాపై చర్చించి, పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు...**

వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కొత్త బోర్ల ఏర్పాటుకు రూ.15 లక్షలు కేటాయించారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్ల కోసం రూ.30 లక్షల నిధులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించారు.

**ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ...**

సమావేశం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం స్వచ్ఛ భారత్ మిషన్ కింద మున్సిపాలిటీకి మంజూరైన స్వీపింగ్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ యంత్రం ద్వారా పట్టణంలో రహదారుల శుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి హామీ...**

సమావేశంలో కౌన్సిల్ సభ్యులు తమ వార్డుల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు, వీధి దీపాల కొరత,



తాగునీటి ఇబ్బందులను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఆమె ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణాభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి హరీష్ రావు ఆర్థికసాయం



**నంగనూరు, అక్టోబర్12 (జనంసాక్షి):** నంగనూరు గ్రామపంచాయతీ కారాబరి బీనబోయిన అశోక్, మల్లేశం గార్ల తల్లి బాలవ్వ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని కోల రమేష్ గౌడ్ సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లగా, వారు తక్షణమే స్పందించి దహన సంస్కారాల కోసం 5,000/- ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన హరీష్ రావుకి రమేష్‌గౌడ్‌కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉల్లి చిన్న మల్లయ్య, ఉప సర్పంచ్ కోల శ్రీధర్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ కోల మహేందర్ గౌడ్, వార్డు సభ్యులు రచ్చ సిద్దు, దేవులపల్లి అఖిల రాజేందర్, మోహన్ రెడ్డి, సతీష్ గౌడ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి భోగాల కోసమే హరీష్‌రావు నాటకాలు

• ఏఎంసి చైర్మన్ దేవులపల్లి యాదగిరి



**నంగనూరు అక్టోబర్ 12 (జనంసాక్షి):** స్వార్థ ప్రయోజనాలు, కుటుంబ భోగాల కోసమే మాజీ మంత్రి హరీష్ రావు మళ్లీ ఉద్య మాల పేరిట సేవా నాటకాలు ఆడుతున్నారని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు ఏఎంసి చైర్మన్ దేవులపల్లి యాదగిరి విమర్శించారు. కాళేశ్వరంలో అవినీతికి పాల్పడి, సాగునీరు, కరెంట్ కష్టాలకు కేసీఆర్, హరీష్ రావులే కారణమయ్యారని మండిపడ్డారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టిన చరిత్ర వారిదని, నిరుద్యోగులకు ఉపాధి ఎందుకు కల్పించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవి, చేర్యాల బాలయ్య, భాస్వరాజ్ రాములు, పంగ రాజశేఖరరెడ్డి, సుద్దాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 14న జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరం

**ముఖ్య అతిథులుగా హాజరుకానున్న జిల్లా కలెక్టర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు**

**సంగారెడ్డి, అక్టోబర్ 12 (జనంసాక్షి):** జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరీక్షల కోసం అక్టోబర్ 14న సంగారెడ్డిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సిద్దిఖ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహాన్ సోమవారం తెలిపారు. స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో, సన్‌రైజ్ ఆసుపత్రి, రథసారథి తెలుగు దినపత్రిక సహకారంతో ఈ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 14న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సంగారెడ్డిలోని సన్‌రైజ్ ఆసుపత్రిలో శిబిరం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ. ఖాదర్ ఫైసల్ ముఖ్య అతిథిగా, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. శిబిరంలో సన్‌రైజ్ ఆసుపత్రికి చెందిన గుండె వైద్యులు, మధుమేహం, ఎముకలు, మెదడు, నాడీ సంబంధిత వ్యాధులు, చిన్నపిల్లలు, మహిళలకు, సాధారణ వైద్య విభాగాల నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సలహాలు అందజేస్తారు. వివిధ రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు అందుబాటులో ఉన్న మందులను కూడా ఉచితంగా పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్,



చిన్న, పెద్ద దినపత్రికలు, కేబుల్ మీడియా, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ వైద్య శిబిరంలో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి హాజరయ్యేవారు సమయ పాలన పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## ఓటు చోరీని అరికట్టాలి.. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలి

**'చలో ఢిల్లీ' కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ నిరసన**

**సంగారెడ్డి, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ఓటు చోరీని అరికట్టాలి.. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలి. కాంగ్రెస్ నేతల డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి మద్దతుగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు సోమవారం న్యూఢిల్లీలో నిర్వహించిన 'చలో ఢిల్లీ' కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగేరి శ్రీహరితో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ



నాయకులు, కార్యకర్తలకు మద్దతు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రానికి



చెందిన పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. సంగారెడ్డి జిల్లా నుంచి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి

## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్లు పాండు, సంగీత అధికారులను ఆదేశించారు**



**సంగారెడ్డి, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు పాండు, సంగీత అధికారులను ఆదేశించారు.సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 69 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. డివిజన్ల వారీగా సంగారెడ్డి నుండి 15, నారాయణఖేడ్ నుండి 2, జహీరాబాద్ నుండి 2 అర్జీలు అందగా, కలెక్టరేట్‌లో 50 అర్జీలు స్వీకరించారు. అందోల్ డివిజన్ నుంచి ఎలాంటి అర్జీలు అందలేదు. ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని అదనపు కలెక్టర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి, హౌసింగ్ పీడీ చలపతిరావు, అదనపు డీఆర్డీఓ బాలరాజ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అడ్వకేట్ ఆర్. గౌతమి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ ఎస్.కె. పాషా అధికారులు పాల్గొన్నారు.

## కబడ్డీ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించిన మాజీ సర్పంచ్ రాజిరెడ్డి..

**చిన్న శంకరంపేట, అక్టోబర్ 12 (జనంసాక్షి):** చిన్న శంకరంపేట మండల కేంద్రంలో కబడ్డీ ప్రీమియర్ లీగ్ (కె.పి.ఎల్) సీజన్-1 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కుమార్, ప్రవీణ్, పప్పు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్రీడా సంబరాన్ని గ్రామ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి టాస్ వేసి అధికారికంగా ప్రారంభించారు. క్రీడలను ప్రోత్సహిస్తూ పోటీలను ప్రారంభించిన రాజిరెడ్డిని గ్రామస్తులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కాసేపు రాజిరెడ్డి గ్రామస్తులు కబడ్డీ ఆట ఆడారు, ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. క్రీడాకారులంతా కక్షపూరిత ధోరణి వీడి, క్రీడా స్ఫూర్తితో ఆడాలని, అంపైర్ల నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఇటీవల కాలంలో కొంతమంది యువకులు గంజాయి వంటి చెడు అలవాట్లకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, తమ దృష్టిని



క్రీడల వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. ఆటల్లో కష్టపడి రాణించడం ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మంచి గుర్తింపు తెచ్చుకుని, ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు రవి, గ్రామ ప్రముఖులు మేడి గణేష్, శ్రీనివాస్, కుమ్మరి మహేష్, నల్ల కుమార్లతో పాటు పెద్ద సంఖ్యలో యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి రెండు దరఖాస్తులు



**కంగ్టి, అక్టోబరు 12(జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో దయాకర్ రావు తెలిపారు. సర్దార్ తండాలో మిషన్ భగీరథ నీటి సరఫరా సరిగా లేదని, కంగ్టిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న వ్యక్తి రోడ్డువైపు ఆరుబయట టాయిలెట్, వాష్ రూమ్ నిర్మించడంతో రహదారికి ఇబ్బందిగా మారిందని ఫిర్యాదులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

## బజాజ్ బైక్‌లపై రూ.12 వేల వరకు పండుగ ఆఫర్లు..

**నర్సాపూర్, అక్టోబర్ 12(జనంసాక్షి):** దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని నర్సాపూర్‌లోని బజాజ్ షోరూమ్ బైక్ కొనుగోలు దారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న షోరూమ్‌లో బజాజ్ బైక్‌ల కొనుగోలుపై రూ.12 వేల వరకు ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు షోరూమ్ ప్రొప్రైటర్ జీ.బాలరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బైక్ కొనుగోలుపై రూ.5వేల నగదు రాయితీతో పాటు ఒక హెల్మెట్, ఐదు లీటర్ల పెట్రోల్, బాడీ కవర్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఆరు ఉచిత సర్వీసులు కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు.

పండుగ ఆఫర్లను వినియోగించుకుని బజాజ్ బైక్‌లను కొనుగోలు చేయాలని వినియోగదారులను కోరారు. బైక్‌ల కొనుగోలుకు వినియోగదారుల ఆసక్తి బజాజ్ షోరూమ్ ప్రకటించిన పండుగ ఆఫర్ల నేపథ్యంలో బైక్‌ల కొనుగోలుపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సోమవారం షోరూమ్‌కు పెద్ద సంఖ్యలో వినియోగదారులు తరలి వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

## సీఎం సహాయ అనేది చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్





**సదాశివపేట, అక్టోబర్ 12(జనంసాక్షి):** సంగారెడ్డి నియోజకవర్గం సదాశివపేట మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సోమవారం అందజేశారు. వివిధ కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొంది వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కోసం సదాశివపేట పట్టణ, మండలంలోని 50 మంది దరఖాస్తు చేసుకున్నారు.

వారికి మంజూరైన 13 లక్షల 13వేల 500 రూపాయల చెక్కుల ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశా రు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్ద గొల్ల ఆంజనేయులు,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడీల సుమిత్ర సుధీర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతా గోపాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లి గుండ్ల వీరేశం, బిఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్య క్షుడు కామిల్, సర్పంచులు తొంట కిష్టయ్య, నాగరాజు, నవీన్ కుమార్, ప్రమోద్, లక్ష్మయ్య, మున్సిపల్ కౌన్సిలర్‌లు నసీరుద్దీన్, నాగుల మానెమ్మ, మాజీ సర్పంచులు లక్ష్మారెడ్డి, కుందెన రాజు, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ పాండు నాయక్, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జ్ఞానేశ కుమార్ రాజీనామా చేయాలి...

- **జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిరసన.. పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి**




**నారాయణఖేడ్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఈ నిరసనలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి ఉండాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా ఎన్నికల సంఘం వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకమని, ప్రతి పౌరుడి ఓటు హక్కుకు తగిన గౌరవం కల్పించాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించడం ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు.

ఎన్నికల వ్యవస్థలో జవాబుదారీతనం పెంపొందించాలని, ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు నమ్మకం కలిగించే చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఎన్నికల సంఘం పనితీరుపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పవిత్రతను కాపాడటం కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొనడం ద్వారా ఎన్నికల సంఘం జవాబుదారీతనం కోసం పార్టీ చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- **ఆత్మ కమిటీ చైర్మన్ ఎన్.కచూర్ రావు**



**రాయికోడు, అక్టోబర్ 12 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాయికోడు, వట్టిపల్లి, మునిపల్లి మండలాల ఆత్మ కమిటీ చైర్మన్ ఎన్. కచూర్ రావు సూచించారు. సోమవారం రాయికోడు రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వినిపించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ, రైతు భరోసా, సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు, విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రబీ పంటల ప్రణాళికపై వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని, శాస్త్రీయ సాగు పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సారిక రెడ్డి, కేదార్నాథ్ పాటిల్, సతీష్ కులకర్ణి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**



**గుమ్మడిదల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్త కుటుంబానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం అనంతారం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెరుగు సాయిలు కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. సాయిలు సేవలను పార్టీ ఎప్పటికీ మరువదని, కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము శీను, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, నాయకుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నీరు లేక నెర్రబారుతున్న భూములు

- **విద్యుత్ అంతరాయాలతో ఎండిపోతున్న పంటలు**



**గుమ్మడిదల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** గుమ్మడిదల మండలం అనంతారం గ్రామంలో విద్యుత్ అంతరాయాలతో సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. సకాలంలో నీరు అందక రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము శ్రీను, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీని కుటుంబాన్ని పరామర్శించిన చేర్యాల మార్కెట్ చైర్మన్ కొమ్మూరి



**చేర్యాల, అక్టోబర్ 12(జనంసాక్షి):** జనగామ జిల్లా కొడవటూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ, ఓబీసీ నాయకుడు నీల రమేష్ మాతృమూర్తి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి సోమవారం వారి నివాసానికి వెళ్లి మాతృమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నీల రమేష్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాయిపల్లిలో ఇందిరమ్మ ఇంటి ప్రారంభం



**రాయికోడు, అక్టోబర్ 12 (జనంసాక్షి):** రాయిపల్లి గ్రామంలో న్యాల కంటి రేణుక శేఖర్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్ధన్న పాటిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేదార్నాథ్ పాటిల్ సోమవారం ప్రారంభించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని నాయకులు పేర్కొన్నారు.

## సమిష్టి కృషితో కరువును ఎదుర్కొందాం



**శివ్వంపేట, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను సమన్వయంతో ఎదుర్కోవాలని రైతులకు మంత్రులు సూచించారు. సోమవారం శివ్వంపేట, గోమారం, కొత్తపేట, దొంతి రైతు వేదికల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. రబీ సీజన్‌లో ఆరుతడి పంటల సాగుపై సూచనలు చేశారు. రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## గాయత్రీ దేవిగా .. వనదుర్గమ్మ



**పాపన్నపేట, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. మహా అరణ్య క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం వనదుర్గా మాతను గాయత్రీ దేవి రూపంలో,గులాబీ రంగు చీరతో పాటు వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు.

దేవస్థాన సమీపం లోని గోకుల్ షెడ్‌లో ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. అర్చకులు మాతకు విశేష పూజలు చేపట్టారు. ఈ అలంకరణలో అమ్మవారు భక్తులకు శోభాయమానంగా దర్శనమిచ్చారు.

# దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

- **సిద్దిపేట సీపీ రష్మి పెరుమాళ్**



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి):** దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు తమ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు ప్రయాణమయ్యే సమయంలో ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ, పండుగ సెలవులను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, కాలనీలు, ఒంటరి ఇళ్ల పరిసరాల్లో పోలీస్ గస్తీ (పెట్రోలింగ్)ని మరింత పటిష్టం చేసినట్లు తెలిపారు. గతంలో నేరాలు నమోదైన సున్నిత ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వెల్లడించారు.

**ప్రజలకు ముఖ్యమైన సూచనలు:**
ప్రయాణానికి వెళ్లే ముందు ఇళ్లకు బలమైన తాళాలు వేసుకోవాలి. ఊరికి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి మరియు అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలి. ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో సరిచూసుకోవాలి. లేని వారు వీలైతే ఏర్పాటు చేసుకోవాలి. ప్రయాణ వివరాలు, ఊరికి వెళ్తున్న విషయాలను సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దు. ప్రయాణ సమయంలో వార్తాపత్రికలు, పాల సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలి. ఇంటి గుమ్మం ముందు పేపర్లు, పాల ప్యాకెట్లు పేరుకుపోతే ఇల్లు ఖాళీగా ఉందనే విషయం దొంగలకు సులభంగా అర్థమవుతుంది. కాలనీలు లేదా గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 112 చేసి లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి అని సూచించారు.

## ఏకపక్ష నిర్ణయంతో కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

- **భగ్గుమన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు**



**చేర్యాల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక ఏకపక్షంగా జరగడంపై ఆకునూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పక్కన పెట్టి, మండల అధ్యక్షుడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోపించారు.
తాజాగా బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి చేరిన కొంతమంది వ్యక్తులు పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, వారికి మండల నాయకత్వం వత్తాసు పలుకుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సొంత పార్టీ కార్యకర్తలను కాదని, పార్టీ మారిన వారికి పదవులు కట్టబెడితే పార్టీ మనుగడకే ప్రమాదమని హెచ్చరించారు. ఈ ఏకపక్ష కమిటీని వెంటనే రద్దు చేసి, నియోజకవర్గ, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి జోక్యం చేసుకొని అందరికీ ఆమోదయోగ్యమైన కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసనకు దిగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ



**చేర్యాల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలోని సాయిబాబా ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు అమ్మవారు శ్రీ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మల్యాల పుష్పలత వేణుమోహన్ గుప్తా మాట్లాడుతూ.. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలందరూ సుభిక్షంగా, ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారి నవరాత్రులు నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేర్యాల ప్రవీణ్ బార్ బిర్యానీలో బైండింగ్ వైర్ ముక్క



**చేర్యాల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** చేర్యాల పట్టణంలోని ప్రవీణ్ బార్ లో చికెన్ బిర్యానీలో బైండింగ్ వైర్ ముక్క వచ్చిందని వినియోగదారులు ఆరోపించారు. బిర్యానీ తింటుండగా అన్నంలో ఇనుప వైర్ ముక్క కనిపించిందని, దీనిపై నిర్వాహకులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని బాధితులు వాపోయారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఫోటోలు చూశాక ఎవరూ బిర్యానీ తినవద్దని కొమురవెల్లి దేవస్థాన మాజీ డైరెక్టర్ సిద్దిరాములు గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆహార భద్రతా అధికారులు స్పందించి హోటల్ పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.










## ఆహారంలో నాణ్యత పాటించాలి



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి):** రెస్టారెంట్లలో వినియోగదారులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని పులిమామిడి రాజు సూచించారు. సోమవారం సంగారెడ్డిలో సన్‌రైజ్ ఆసుపత్రి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన దావత్ రెస్టారెంట్ రెండో శాఖను ఆయన ప్రారంభించారు. నాణ్యతతోనే వ్యాపారంలో విజయం సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెస్టారెంట్ నిర్వాహకులు వడ్ల బింబాధర్ చారి, రమేష్, సంగమేశ్వర్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సోలార్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా గిరిజనుల నిరసన



**సిర్గాపూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండలం జెమ్లా నాయక్ తండాలో సోలార్ ప్లాంట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గిరిజనులు నిరాహార దీక్ష చేపట్టారు. 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను ప్రాజెక్టు పేరుతో లాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు. గ్రామసభ అనుమతి లేకుండా సర్వే నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సోలార్ హటావో-జెమ్లా తండా బచావో' నినాదంతో ఆందోళన చేపట్టారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి, ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ఆశ్రమం..

- **భవాని దీక్షలో 100 మంది యువతీ యువకులు...**



**ఝరాసంగం, అక్టోబర్ 12(జనంసాక్షి):** విజయదశమి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఝరాసంగం మండలం బర్దిపూర్ గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రీ భవానీ దేవాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సుమారు 100 మంది యువతీ యువకులు భవాని దీక్ష చేపట్టి తొమ్మిది రోజులపాటు నియమనిష్ఠలతో పూజలు నిర్వహించనున్నారు.

## బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- **ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ**



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 12(జనంసాక్షి):** ప్రజావాణిలో వినతులు అందించిన బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పి నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని ఫిర్యాదులను స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## సిర్గాపూర్‌లో Season-2 వాలీబాల్ టోర్నమెంట్ రేపే




**సిర్గాపూర్ అక్టోబర్ 12 (జనంసాక్షి):** సిర్గాపూర్ యూత్ వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో Open to All Season-2 వాలీబాల్ టోర్నమెంట్-2026 రేపు మంగళవారం సిర్గాపూర్ మండల కేంద్రంలోని ZPHS ఉన్నత పాఠశాల మైదానంలో ఘనంగా నిర్వహించనున్నారు.
యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 21,000/-లను సిర్గాపూర్ గ్రామ సర్పంచ్ డి. శ్రీనివాస్ రావ్ పాటిల్ గారు, ద్వితీయ బహుమతి రూ. 11,000/- లను గ్రామ యువ నాయకులు డి.కిరణ్ రావ్ పాటిల్ గారు స్పాన్సర్ చేశారు. కావున చుట్టుపక్కల గ్రామాల క్రీడాకారులు అందరూ పాల్గొని ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని సిర్గాపూర్ వాలీబాల్ యూత్ అసోసియేషన్ కోరింది.

## చేర్యాలలో కాంగ్రెస్ వార్డు కమిటీల ఎన్నిక



**చేర్యాల, అక్టోబర్ 12(జనంసాక్షి):** మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప రెడ్డి పిలుపు మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో వార్డు కమిటీల ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 8వ వార్డు అధ్యక్షుడిగా నీలం సునీల్ కుమార్ (సన్నీ), 11వ వార్డు అధ్యక్షుడిగా పచ్చిమడ్ల సత్యనారాయణ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పూర్మ ఆగంరెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్

- **ప్రధాన పైప్‌లైన్ లీకేజీ మరమ్మతుల కారణంగా సరఫరాకు అంతరాయం**
- **మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మి**

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి):** మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ లీకేజీ మరమ్మతుల కారణంగా జిల్లాలోని పలు మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 12, 13 తేదీల్లో తాగునీటి సరఫరా నిలిచిపోనుంది. బూసరెడ్డిపల్లి ఫిల్టర్ బెడ్ నుంచి బుదేరా వరకు ఉన్న 1200 మిల్లీమీటర్ల ప్రధాన పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో మరమ్మతులు చేపడుతున్నట్లు మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మి తెలిపారు.
మునిపల్లి, కోహీర్, ఝరాసంగం, జహీరాబాద్, మొగుడంపల్లి, సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్, తెల్లాపూర్, అమీన్‌పూర్, ఇంద్రేశం, పటాన్‌చెరు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ముందస్తుగా నీటిని నిల్వ చేసుకోవాలని అధికారులు సూచించారు.

# పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

- **సీపీఐ రాష్ట్ర నాయకుడు బట్టు దయానందరెడ్డి**




**జగదేవ్‌పూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** తెలంగాణలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు బట్టు దయానందరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వేతనాలు అందక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ, దసరా పండుగలలోపే జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో శివలింగ కృష్ణ, స్వర్గం రాజేశం, చింత శీను పాల్గొన్నారు.

# పదేళ్ల పండుగ.. పది తరాలకు గుర్తుండేలా జరిగింది

- **మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు**



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా పదేళ్ల పండుగ పది తరాలకు గుర్తు ఉండేలా జరిగిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారు సంతోషం వ్యక్తం చేశారు.. ముగింపు సభ అద్భుతం గా జరిగిందని సభ కు తరలివచ్చిన ప్రజానీకానికి కృషి చేసిన పార్టీ నాయకులకు కార్యకర్తలకు హరీష్ రావు గారు కృతజ్ఞతలు తెలిపారు.సిద్దిపేట జిల్లా ఏర్పాటు జరిగి పదేళ్లు అయిన సందర్భంగా జిల్లా పండుగ చేద్దామని నిర్ణయం తీసుకున్నప్పటి నుండి నిన్న ముగింపు సభ అయ్యేంత వరకు ఎన్నో కార్యక్రమాలు ఎంతో మంది వివిధ రూపాల్లో చేశారని, ఎవరికీ వారు స్వచ్ఛందంగా నిర్వహించారని చెప్పారు. సన్నాహక సమావేశంలో ఎంతో మంది తమ సలహాలు సూచనలు ఇచ్చారని వారి అభిప్రాయాలు స్వీకరించి మూడు రోజుల కార్యక్రమం ఘనంగా నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయిన కవులు, కళాకారులు, జర్నలిస్టులు, వైద్యులు, లాయర్లు, ప్రజాసంఘాలు, వ్యాపారులు, విద్యావేత్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు తదితర సంఘాల ప్రతినిధులకు హరీష్ రావు గారు ధన్యవాదాలు తెలిపారు. పదేళ్ల పండుగను మూడు గత వారం రోజుల నుండి పత్రిక ప్రకటనలు, ప్రత్యేక కథనాలు ప్రచురించి యూట్యూబ్ ఛానల్స్ ద్వారా సిద్దిపేట ఖ్యాతి ని ప్రపంచం స్థాయి లో తెలియజేశారని, అదేవిదంగా సోషల్ మీడియా లో ఎవరికీ వారు స్వచ్ఛందంగ సిద్దిపేట జిల్లా పండుగ స్ఫూర్తి ని చాటి చెప్పారని ఈ సందర్భంగా వారికి నా హృదయపూర్వక ధన్యవాదములని చెప్పారు.ఈ స్ఫూర్తి సిద్దిపేట జిల్లా అభివృద్ధిలో నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.

# భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు

- **గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారు**



**సంగారెడ్డి, అక్టోబర్ 12 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని తొగర్ పల్లి గ్రామంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం అమ్మవారూ గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సర్పంచ్ దివ్యవాణి ప్రశాంత్ గౌడ్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

# బొంతపల్లిలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

- **రెండో రోజు గాయత్రీ దేవిగా అమ్మవారి దర్శనం**



**గుమ్మడిదల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** గుమ్మడిదల మండలం వీరన్నగూడెం (బొంతపల్లి)లోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు అమ్మవారు గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజ లు, హోమం పూర్ణాహుతి నిర్వహించారు.

వేదమంత్రాలతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంత రించుకుంది. ఈ నెల 20వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు.

# బతుకమ్మ, దసరా పండుగల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- **చేర్యాల ఎస్ఐ గూడ అపూర్వరెడ్డి**

**చేర్యాల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేర్యాల ఎస్ ఐ గూడ అపూర్వరెడ్డి సూచించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సెలవుల నేపథ్యంలో ఊర్లకు వెళ్లే వారు ఇంటికి తాళం వేసిన విషయాన్ని పక్కింటి వారికి, పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలి. భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. నవరాత్రుల్లో దుర్గా మండపాల వద్ద డీజేలు, లక్కీ డ్రాలు నిర్వహించరాదన్నారు. రాత్రి వేళల్లో కనీసం నలుగురు మండపం వద్ద కాపలా ఉండాలని, రావణ దహనం నిర్వహించే వారు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, దసరా రోజు మద్యం మత్తులో గొడవలు, ఇతరులకు ఇబ్బంది కలిగించడం, వాహనాలు నడపడం చేయవద్దన్నారు. పండుగకు వెళ్లే వారు జాగ్రత్తగా ప్రయాణించాలని ఎస్ ఐ సూచించారు.

# ప్రశాంతంగా.. ప్రజావాణి

- **జనంసాక్షి కథనానికి స్పందన**



**పాపన్నపేట, అక్టోబర్ 12(జనంసాక్షి):** మెదక్ జిల్లాలో పెద్ద మండలమైన పాపన్నపేటలో ప్రశాంతంగా ప్రజావాణి సాగుతుంది. సోమవారం పాపన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ప్రజల నుండి దరఖాస్తులు రాలేదు. సెప్టెంబర్ 28 న జరిగిన ప్రజావాణికీ పోలీస్ శాఖ అధికారులు హాజరు కావడం లేదని పోలీస్ శాఖ డుమ్మా అని జనంసాక్షి కథనం ప్రచురించగా స్పందన లభించింది. ఆశాఖ నుండి ప్రజావాణికి ఓ అధికారి సైతం హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో విష్ణువర్ధన్,తహసీల్దార్ సతీష్ కుమార్,హౌసింగ్ ఎఈ అరుణ్, అటవీ శాఖ బీట్ అధికారిణి శారద, వివిధ శాఖల నుండి అధికారులు దేవరాజు,రవికుమార్,సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

# పేరుకే ప్రజావాణి.. 22 రోజులు గడిచినా పరిష్కారం కాని సమస్య!

## నర్సింహారెడ్డి చెరువును కాపాడాలి: కాంగ్రెస్ నేత రాథోడ్ వినోద్ కుమార్






**కోహిర్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాథోడ్ వినోద్ కుమార్ ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం పిచరాగడి పాత తండా శివారులోని నర్సింహారెడ్డి చెరువు కబ్జాకు గురవుతోందని ఫిర్యాదు చేసి 22 రోజులు గడిచినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

గత నెల 21న కోహిర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్వే నంబర్ 100లో ఉన్న నర్సింహారెడ్డి చెరువు భూమిని పరిరక్షించాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు క్షేత్రస్థాయి విచారణ చేపట్టినట్లు గానీ, ఆక్రమణలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి నోటీసులు ఇచ్చినట్లు గానీ తనకు సమాచారం లేదన్నారు. ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు.

**మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలి...**

ప్రజలు తమ సమస్యల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్నారని వినోద్ కుమార్ గుర్తు చేశారు. ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించకపోతే కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమి టని ప్రశ్నించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై అధికారులు సకాలంలో స్పందించి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

**చెరువు భూమిని పరిరక్షించాలి...**

నర్సింహారెడ్డి చెరువుపై వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వే చేపట్టాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా పరిరక్షించడం అధికారుల బాధ్యత అని అన్నారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి నిర్దిష్ట గడువు విధించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నర్సింహారెడ్డి చెరువును కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# దుర్గమ్మ విగ్రహ ఏర్పాటుకు రూ.28,111 విరాళం




**నర్సాపూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గామాత విగ్రహ ఏర్పాటుకు సర్పంచ్ పద్మావతి అశోక్‌గౌడ్ సోమవారం రూ.28,111 విరాళంగా అందజేశారు. అమ్మవారి కృపతో సర్పంచ్‌గా ఎన్నికయ్యానన్న విశ్వాసంతో విరాళం అందించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, ఐకమత్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఆమె ఔదార్యంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా జర్నలిస్టుల జన్మదిన వేడుకలు



**వెల్దండ, అక్టోబర్ 12 (జనంసాక్షి):** వెల్దండ మండల కేంద్రంలో పాత్రికేయుల ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టులు రాజయ్య శ్రీనివాసులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు వేడుకలకు ముఖ్య అతిథులుగా డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్నం భూపతిరెడ్డి ఆర్యవైశ్య మహాసభ జిల్లా మాజీ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ పాల్గొని జర్నలిస్టుల రాజయ్య శ్రీనివాసులను శాలువాలతో సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో శంకర్ నాయక్ కొయ్యల పుల్లయ్య ఎండి రషీద్ గజిని శ్రీనివాసులు ఈదులపల్లి శ్రీనివాసులు పాత్రికేయులు మల్లేష్ రామకృష్ణ దశరథం వెంకటేష్ నరసింహా రామాంజనేయులు రమేష్ లింగం దండు జగన్ వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు



**రాయికోడు,అక్టోబర్ 12, (జనంసాక్షి):** మండల కేంద్రమైన,రాయికోడు లోని ముమ్మాదేవి ఆలయం, జంబిగి ఇటుక పల్లి, శంషుద్దీన్ పూర్, సిరూర్, ఔరంగ నగర్, తదితర గ్రామాలలో దేవి నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.ఈ మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా రెండవ రాజైన సోమవారం శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా పలు గ్రామాల అమ్మవారి మండపాల వద్ద అర్చకులు సకరం జోషి, సందీప్ జోషి, సంజీవ్ చేసి, నీలకంఠయ్య స్వామి, పలువురు అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆయా గ్రామాలలో రాత్రంతా అమ్మవారి సన్నిధిలో భజన కీర్తనలు నిర్వహించి జాగరణ చేశారు. రైకోడు ముమ్మాదేవి ఆలయం వద్ద ప్రతిరోజు భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల భజన మండలి భక్తులతో పాటు పలువురు కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

- సబ్ కలెక్టర్ ఉమా హారతి పిలుపు..
- ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచన



**నారాయణఖేడ్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** రానున్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల సమీపంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి సూచించారు. సోమవారం మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో జలసిరి పథకం కింద చేపడుతున్న పనులను ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వీబీ-జీ రామ్ జీ పథకం ద్వారా రైతులకు, కూలీలకు ఉపయోగపడే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడిన ఆమె, అర్హులైన కూలీలందరూ ఉపాధి పనులను వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామంలో కూలీలకు ప్రతిరోజూ ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయ్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, సహాయకులు శ్రీనివాస్, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినికి ఘన సన్మానం



**ఆత్మకూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ఆత్మకూరు మండలం బాలకిష్టాపూర్ గ్రామానికి చెందిన చిన్న చాంద్ పాషా కుమార్తె అర్షియా జాతీయ స్థాయికి ఎంపికై మైనార్టీ గురుకుల పాఠశాల, గద్వాలలో పదవ తరగతి చదువుతున్న అర్షియా.. సబ్ జూనియర్ త్రో బాల్ పోటీల్లో జాతీయ స్థాయికి సెలెక్ట్ అయింది. ఈ శుభ సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్తన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, నాయకులు ఆర్. పరమేష్, తులసిరాజు యాదవ్, నాగేష్, ఈర్లదిన్నె శ్రీనివాసులు, సద్దల వెంకట రాములు, హరీష్ గౌడ్, ఖాజన్న, గడ్డమీద అశోక్, రవి, చిన్న, గ్రామస్తులు జంగం వెంకటేష్, వార్డ్ మెంబర్ మొబైల్ ఖాజా, పెద్ద చాంద తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ఇళ్ల భరోసా



**కొత్తపల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి):** కొత్తపల్లి మండలం మన్నాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణానికి స్థలాల మార్కింగ్ ప్రక్రియ చేపట్టారు. గ్రామ సర్పంచ్ లలితమ్మ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులు జబ్బని అనిత, భూదేవిలకు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చి, నివాస భద్రత కల్పించడమే పథకం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా సొంతింటి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## కల్వకుర్తిలో నేడు ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటన

- మార్చాలలో అభివృద్ధి కార్యక్రమాలు..
- పట్టణంలో మేదరి సంఘం కార్యక్రమానికి హాజరు



**కల్వకుర్తి,అక్టోబర్ 12(జనంసాక్షి):** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి మంగళవారం నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.మధ్యాహ్నం 2 గంటలకు కల్వకుర్తి పట్టణంలోని కేబీఎన్ ఫంక్షన్ హాల్‌లో మేదరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరవుతారు.ఈ కార్యక్రమాలకు సంబంధిత కౌన్సిలర్లు, సర్పంచులు, మండలనాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రతినిధులు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

## కల్వకుర్తి ఎంపీడీఓగా గాలి యాదయ్య

- కందుకూరు మండలానికి జిల్లెల్ల గీత బదిలీ.. బాధ్యతల అప్పగింత



**కల్వకుర్తి, అక్టోబర్ 12(జనంసాక్షి):** కల్వకుర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తున్న జిల్లెల్ల గీత కందుకూరు మండలానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఈ మేరకు సోమవారం కల్వకుర్తి మండలం నుంచి ఆమె రిలీవ్ అయ్యారు.ఆమె స్థానంలో ఇప్పటివరకు కార్యాలయ పర్యవేక్షకుడిగా విధులు నిర్వహిస్తున్న గాలి యాదయ్యకు ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నేపథ్యంలో జిల్లెల్ల గీత గాలి యాదయ్యకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఇద్దరినీ పూల మాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్, ప్రసాద్, సురేందర్, చంద్రశేఖర్, రమేశ్,తిరుపతి, దీప,ఎల్లమ్మ తదితరులుపాల్గొన్నారు.

## హైకోర్టులో భీమన్నకు ఊరట!



**రాజోళి, అక్టోబర్ 12(జనంసాక్షి):** మాన్‌దొడ్డి ఉపసర్పంచ్ భీమన్న చెక్ పవర్ రద్దుచేస్తూ జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి తెలిపారు. ఎలాంటి విచారణ లేకుండా చెక్ పవర్ రద్దుచేయడం అన్యాయమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి భీమన్న సమన్వయంతో పని చేశారని అన్నారు. ఉపసర్పంచ్‌లను భయభ్రాంతులకు గురిచేసేలా ఉన్న జీవోను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## బైక్ ఢీకొని వ్యక్తి మృతి



**కృష్ణ, అక్టోబర్ 12 (జనంసాక్షి):** కృష్ణ మండలం పరిధిలోని నల్లగట్టు మారెమ్మ ఒక వ్యక్తి శక్తి నగర్ నుండి నల్లగట్టు మారెమ్మ గుడి దర్శనానికి బయలుదేరి దర్శనం అయ్యాక సాయంత్రం. ఆదివారం అందాజు 7:45 గంటలకు శక్తి నగర్ నడుచుకుంటూ వెళుతుండగా ఒక రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ నెంబర్ ఎపి40 హెచ్ జెడ్9396 అతివేగంగా ఆ జాగ్రత్తగా వేనక నుండి ఢీ కొట్టడంతో, వెంకప్ప అనే వ్యక్తి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి కుమారుడు పరశురాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కృష్ణ ఎస్ఐ నవీద్ తెలిపారు.

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు పంపిణీ



**అమరచింత, అక్టోబర్ 12 (జనంసాక్షి):** మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలు, కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు అమరచింత మండలంలోని మిట్ట నందిమల్ల, నాగల్ కదుమూరు, చంద్రప్ప తాండ గ్రామాలకు చెందిన అర్హులైన పేదలకు ఎంపీడీవో శ్రీనివాసులు సోమవారం ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుండెపోటుతో చికిత్స పొందుతున్న భారతమ్మకు ఆర్థికసాయం



**వెల్దండ, అక్టోబర్ 12 (జనంసాక్షి):** గుండెపోటుతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెల్దండకు చెందిన నాగిళ్ల భారతమ్మను బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు కానుగుల జోగయ్య పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమెకు ధైర్యం చెప్పారు. తక్షణ సాయంగా జోగయ్య రూ.5 వేలు, వార్డు సభ్యుడు శేఖర్ రూ.5 వేలు కలిపి మొత్తం రూ.10 వేల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతి నిరంజన్, కట్ట అనిల్ కుమార్, శివరాజ్, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

## మాగనూర్ మండల అధ్యక్షుడిపై ఫిర్యాదు



**మాగనూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** మాగనూర్ మండల బీజేపీ అధ్యక్షుడు జయానంద్ రెడ్డి వ్యవహారశైలిపై జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్‌కు ఫిర్యాదు చేసినట్లు మండల ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్ తెలిపారు. ఎలాంటి షోకాజ్ నోటీసు ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండా దానే తనను పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న కార్యకర్తలకు గౌరవం ఇవ్వాలని, పార్టీ నియమ నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పోకుండా మండల అధ్యక్షుడు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. దీనివల్ల పార్టీలో అసంతృప్తి పెరిగి పార్టీకి నష్టం కలిగే ప్రమాదం ఉందన్నారు. జయానంద్ రెడ్డి వ్యవహారశైలిపై విచారణ జరిపి, పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. విద్యాసాగర్, మాజీ మండల అధ్యక్షుడు జి. నారాయణ, సీనియర్ నాయకులు మురళీధర్ గౌడ్, బీజేవైఎం నాయకుడు భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన అవసరం

- సెక్షన్ 4, 10, 7(6) అమలుతో పారదర్శక పాలనకు బలోపేతం



**ఉప్పునుంతల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, అధికారుల జవాబుదారీతనం పెరుగుతాయని సమాచార హక్కు రక్షణ చట్టం-2005 రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మొగిలి శేఖర్ అన్నారు. అక్టోబర్ 12 సమాచార హక్కు దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, ప్రజాధనంతో పనిచేసే కార్యాలయాలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు, నిధుల వినియోగం, అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం పౌరులకు అవకాశం కల్పిస్తుందని వివరించారు.

**సెక్షన్ 4తో స్వచ్ఛంద సమాచార వెల్లడి...**

చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు తమ విధులు, అధికారాలు, నిర్ణయాలు, నిధుల వినియోగం వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి సమాచారానికి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేకుండా నిర్దేశిత వివరాలను స్వచ్ఛందంగా వెల్లడించాలన్నారు.

**సెక్షన్ 10తో సమాచారానికి అవకాశం...**

ఒక పత్రంలోని కొంత సమాచారం మాత్రమే మినహాయింపులకు లోబడి ఉంటే, ఆ భాగాన్ని వేరు చేసి మిగిలిన సమాచారాన్ని అందించేందుకు సెక్షన్ 10 అవకాశం కల్పిస్తుందని తెలిపారు. గ్రామపంచాయతీల అభివృద్ధి పనుల బిల్లులు, ఖర్చులు, కొలతల పుస్తకాల వివరాలను నిబంధనల ప్రకారం అందించాలని పేర్కొన్నారు.

**గడువు దాటితే సమాచారం ఉచితం...**

సెక్షన్ 7(6) ప్రకారం నిర్ణీత గడువులో సమాచారం ఇవ్వకపోతే దరఖాస్తుదారునికి ఉచితంగా అందించాలని తెలిపారు. సాధారణంగా 30 రోజుల్లో సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సమాచార అధికారులకు శిక్షణ, అప్పీల్ విధానాలపై అవగాహన, గ్రామీణ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు అవసరమని మొగిలి శేఖర్ సూచించారు. చట్టం సమర్థంగా అమలైతే పారదర్శక పాలన, ప్రజాధన పర్యవేక్షణ, అధికారుల జవాబుదారీతనం బలోపేతమవుతాయని పేర్కొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి మరో ముందడుగు

• ఈ నెల 14న సంగారెడ్డిలో ఉచిత వైద్య శిబిరం



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి): జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ నెల 14న సంగారెడ్డిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెం మల్లేశం, సదాశివపేట తాలూకా అధ్యక్షుడు హాజీ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ విభాగం, టీయూడబ్ల్యూజే జిల్లా యూనిట్, సన్‌రైజ్ ఆస్పత్రి, రథసారథి తెలుగు దినపత్రిక సహకారంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ నెల 14న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సన్‌రైజ్ ఆస్పత్రి సమీపంలో వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైసల్, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి హాజరుకానున్నారు. వివరాలకు మొహమ్మద్ సిద్దిఖ్ (9160182182), చౌహాన్ ఈశ్వర్ (6303622789)ను సంప్రదించాలని సూచించారు.

## శిలాఫలకంపై పేరు వివాదం.. కలెక్టర్‌కు ఫిర్యాదు

• కుల వివక్ష చూపుతున్నారని ఉప సర్పంచ్ ఆరోపణ



ఉర్కొండ, అక్టోబర్ 12 (జనంసాక్షి): నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలంలోని ఇప్పపహాడ్ నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ భూమిపూజ శిలాఫలకంపై తన పేరును చేర్చలేదంటూ ఆ గ్రామ ఉపసర్పంచ్ దుబ్బ భాగ్యరాణి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.

మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా ఇప్పపహాడ్ నూతన పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారని, ఆ శిలాఫలకంపై స్థానిక ఉపసర్పంచ్ అయిన తన పేరును వేయలేదని ఆమె ఆరోపించారు. తాను మహిళను, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన దళిత ఉపసర్పంచ్ అయినందునే తగిన గౌరవం ఇవ్వకుండా కుల వివక్ష చూపి అవమానించారని పేర్కొన్నారు. ప్రజావాణిలో కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. శిలాఫలకం ఏర్పాటు చేసిన అధికారులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు.

కలెక్టర్ ను కలిసిన వారిలో ఉపసర్పంచ్ దుబ్బ భాగ్యరాణితో పాటు గ్రామ పెద్దలు ఉన్నారు.

## భూ సమస్య పరిష్కారంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం!

• ఏడాదిగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం శూన్యం



ఉప్పునుంతల, (జనంసాక్షి): ఉప్పునుంతల మండల పరిధి లోని భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నాగరాజు డిమాండ్ చేశారు. ఏడాది కాలంగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు సమస్యను పరిష్కరించడం లేదని ఆరోపించారు.

ఉప్పునుంతల శివారులోని సర్వే నంబర్ 168లో చింతల బాలకిష్టయ్య తండ్రి బాలయ్య పేరుపై 1983లో 2 ఎకరాల 4 గుంటల భూమి పట్టా నమోదైందని తెలిపారు. అయితే ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత కంప్యూటర్ పట్టాదారు పాస్ పుస్తకంలో కేవలం 16 గుంటల భూమి మాత్రమే నమోదైందని పేర్కొన్నారు. మిగిలిన భూమి నమోదు కాకపోవడంతో సమస్య ఏర్పడిందన్నారు.

బాలకిష్టయ్య వారసులైన శాయిలమ్మ, నాగరాజు, చిన్న నాగరాజు పేర్లపై పట్టా చేయించు కున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా దరఖాస్తులు సమర్పించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని రికార్డులు పరిశీలించి మిగిలిన భూమిని పట్టాలో నమోదు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతి సోమవారం ప్రజావాణి..

## ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



తెలకపల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గత ఆగస్టు 17, 2026 నుంచి మండల స్థాయిలో ఈ కార్యక్రమం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరవుతున్నారని, ప్రజలు తమ వ్యక్తిగత, గ్రామస్థాయి సమస్యలు, ఇతర ఫిర్యాదులను సంబంధిత అధికారులకు నేరుగా అందజేయవచ్చని తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కావున మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించి, తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఫిర్యాదులు అందజేయాలని ఎంపీడీవో కోరారు. ప్రజలకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు పత్రికా మిత్రులు సమాచారాన్ని ప్రచురించాలని విజ్ఞప్తి చేశారు.

## తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

**నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. యాసంగి 2026–27 సీజన్‌లో నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితులను బట్టి రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

రైతు నేస్తం వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ పెసలు, మినుములు, శనగ, కుసుమ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరు బావుల పునరుద్ధరణ ద్వారా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు పంటల ఎంపిక, సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వర్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి, జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతను అవమానిస్తే సహించేది లేదు...

• రైతును అవమానించిన తహసిల్దార్
• సస్పెన్షన్‌తో సరిపెట్టొద్దు.. కఠిన చర్యలు తీసుకోవాలి
• రైతుల పట్ల అధికారుల తీరు మారాలి
• మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్





సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి): ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ అన్నదాతలను అవమానిస్తే సహించేది లేదని మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో రైతులతో కలిసి పృథ్వీరాజ్ మాట్లాడారు.. గజ్వేల్ మండల రెవెన్యూ కార్యాలయంలో శాంతం రాజు అలియాస్ యేసు పట్ల జరిగిన ఘటనను మంజీరా రైతు సమాఖ్య తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అన్నదాతను అవమానించిన మండల రెవెన్యూ అధికారిని సస్పెండ్ చేసినందుకు జిల్లా కలెక్టర్‌ను సమాఖ్య ప్రతినిధులు అభినందించారు. ఎండనకా వాననకా కష్టపడి పంటలు పండించి దేశ ప్రజల ఆకలి తీర్చే రైతులను అవమానించడం బాధాకరమని అన్నారు. రైతుల శ్రమను, ఆత్మగౌరవాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, రైతుల పట్ల మర్యాదగా వ్యవహరించడం ప్రభుత్వ అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు.

రైతులను అవమానించే ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను అవమానించినట్లు విచారణలో తేలితే, కేవలం సస్పెన్షన్‌తో సరిపెట్టకుండా నిబంధనల ప్రకారం ఉద్యోగం నుంచి తొలగించే స్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు దేశానికి వెన్నెముక అని, అన్నదాత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమం కోసం మంజీరా రైతు సమాఖ్య ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడు టి. పృథ్వీరాజు, ఉపాధ్యక్షుడు సంగీశెట్టి, సభ్యులు ధనంజయ, గోవురాజు, గౌలిశ్వర్, కె. విఠల్, గణపతి, కాశీనాథ్, శేఖర్ పాల్గొన్నారు.

## దసరా సెలవుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఆత్మకూరు సీఐ టి.శివకుమార్



ఆత్మకూరు సీఐ టీ. శివకుమార్

ఆత్మకూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి): దసరా పండుగ, విద్యాసంస్థలకు సెలవుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. శివకుమార్ సూచించారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ స్వగ్రామాలకు వెళ్లే ముందు ఇంటి తలుపులు, కిటికీలు సక్రమంగా మూసి తాళాలు వేయాలని, బంగారు ఆభరణాలు, నగదు, విలువైన వస్తువులను భద్రంగాఉంచుకోవాలన్నారుఇంట్లో ఎవరూ లేరనే విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయవద్దని సూచించారు. గ్రామాల చివరన ఉన్న ఇళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మద్యం దుకాణాలు, ఏటీఎంలు, బంగారు దుకాణాలు, బ్యాంకుల సమీపంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

**ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి...**

ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని హెచ్చరించారు. పిల్లలను రద్దీ ప్రదేశాల్లో ఒంటరిగా వదలవద్దని తల్లిదండ్రులకు సూచించారు.ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 కు కాల్ చేయాలని తెలిపారు.

## విద్యార్థినులపై వేధింపుల ఆరోపణలు.. ఎంపీపై చర్యలు తీసుకోవాలి



వనపర్తి, అక్టోబర్ 12 (జనంసాక్షి): జేఎన్‌యూ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజంపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మహిళా మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా అధ్యక్షురాలు జి. కవిత యాదవ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెంటం పల్లి పురుషోత్తం రెడ్డి, రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఆరోపణలను తీవ్రంగా పరిగణించి కాంగ్రెస్ నాయకత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కోరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ అంశంపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వద్ద మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు రూప్ కుమారి చౌదరి, దగ్గుబాటి పురంధేశ్వరి నేతృత్వంలో జరిగిన నిరసనకు మద్దతుగా వనపర్తిలో ఆందోళన నిర్వహించినట్లు కవిత యాదవ్ తెలిపారు. మహిళల గౌరవం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వారణాసి కల్పన, పెద్దిరాజు, శ్వేతా యాదవ్, సుమిత్రమ్మ, సరోజ యాదవ్, నక్క మహేష్, బత్తిని మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# మండుటెండల్లో మండిపడ్డ ఎమ్మెల్యే...!

- రైతుల పాలిట శాపంగా మారిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రైతు ధర్నా

కౌడిపల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి): రైతులకు 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ సమస్యల కారణంగా ఎండిపోయిన వరి పొలాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. మెదక్--నర్సాపూర్ జాతీయ రహదారిపై ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలన్నారు.

**రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి...**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ అందకపోవడంతో పంటల సాగుపై ప్రభావం పడుతోందని అన్నారు. రైతులు పండించిన పంటలు కళ్ల ముందే ఎండిపోతే వారు తీవ్రంగా నష్టపోతారని, ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిగణించాలని కోరారు.

**ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి...**

విద్యుత్ సమస్యలతో ఎండిపోయిన వరి పొలాలను ప్రభుత్వం పరిశీలించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయి ఆర్థికంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రైతులు పెట్టుబడుల కోసం అప్పులు చేసి సాగు చేస్తున్నారని, పంటలు దెబ్బతింటే వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, వ్యవసాయ రంగానికి అవసరమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్...**

రైతులకు సాగునీరు, విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయ



కులు కోరారు. వ్యవసాయానికి విద్యుత్ ఎంతో కీలకమని, సరైన సమయంలో విద్యుత్ అందకపోతే పంటల దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించి, వ్యవసాయాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, మాజీ సిడిసి చైర్మన్ దుర్గారెడ్డి, బిసవురుషోత్తం, వార్డు సభ్యులు రాజీవ్ రెడ్డి, సందీప్, యువ నాయకులు పోల నవీన్, వార్డు సభ్యులు సంగప్ప, వెల్మకన్న సర్పంచ్ కుమ్మరి శివలీల సతీష్, కొట్టాల సర్పంచ్ సుమలత, మహమ్మద్ నగర్ సర్పంచ్ రవి యాదవ్, మాజీ సర్పంచ్ మైపాల్ రెడ్డి, ధర్మసాగర్ సర్పంచ్ శివానందరెడ్డి, గుంజరి ప్రవీణ్, భుజరంపేట్ సర్పంచ్ పట్లోళ్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ కౌడిపల్లి గోపాల్, నీరుడి కుమార్, దుర్గమ్మ సత్తయ్య, నాయికోటి శ్యామ్ సుందర్ రావు, కాంతారావు, ప్రవీణ్, నాయికోటి లింగం తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## వనపర్తి ఛాంపియన్‌షిప్ కప్-2026కు మండల స్థాయి ఎంపికలు

గోపాలపేట, అక్టోబర్ 12 (జనంసాక్షి): వనపర్తి ఛాంపియన్‌షిప్ కప్--2026 జిల్లా స్థాయి పోటీలకు గోపాలపేట పాఠశాల మైదానంలో అక్టోబర్ 13న మండలస్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 16, 17 తేదీల్లో జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరగనున్నాయి. క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారమ్స్, తాడులాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఎంపీడీవో, తహసీల్దార్, మండల విద్యాధికారి కోరారు.

## కాపస్ కాంతి అధిక సాంద్రత పత్తి ఫీల్డ్ డే



జడ్చర్ల, అక్టోబర్ 12 (జనంసాక్షి): కాటన్ ప్రొడక్టివిటీ మిషన్ (కాపస్ కాంతి) పథకంలో భాగంగా నసురుల్లాబాద్ గ్రామంలోని ఒక రైతు పొలంలో సోమవారం అధిక సాంద్రత పత్తి ఫీల్డ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ కాపస్ కాంతి పథకంలో భాగంగా జూలైలో నసురుల్లాబాద్ రైతులకు అధిక సాంద్రత పత్తి విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ పద్ధతిలో సాధారణ సాగు కంటే ఎకరానికి మొక్కల సాంద్రత ఎక్కువ ఉంటుందన్నారు. సాధారణ సాగుతో పోలిస్తే ఎక్కువ మొక్కలు ఉండటం వల్ల కాయల సంఖ్య పెరిగి, అధిక దిగుబడి, లాభాలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గోపీనాథ్, వ్యవసాయ విస్తరణ అధికారి శంకర్, రైతులు బాలస్వామి, బంగారు శ్రీనివాసులు, రాములు, సాయన్న, చిన్న జంగయ్య, మహిళా రైతులు పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు నిరసనలు: నీలం మధు ముదిరాజ్








పటాన్చెరు, అక్టోబర్ 10(జనంసాక్షి): కేంద్ర ఎన్నికల సంఘం తీరును ఆక్షేపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలోని బారకాంబ జంక్షన్ నుండి సుప్రీమ్ కోర్ట్ వరకు కాంగ్రెస్ అగ్రనేతల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన మార్చ్ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో కలిసి నిరసన ప్రదర్శనలో భాగస్వాములయ్యారు. ఈ మార్చ్‌లో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష పేరుతో లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం, అధికార పార్టీకి కొమ్ము కాస్తూ రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను విస్మరిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడికి అతిపెద్ద ఆయుధమైన ఓటు హక్కును కాలరాసేందుకు జరుగుతున్న కుట్రలపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న ఈ పోరాటానికి తెలంగాణ కాంగ్రెస్ శ్రేణుల పూర్తి సన్నద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుండి తొలగించి, ప్రజాస్వామ్య బద్ధంగా ఓటర్ల జాబితాలను పునరుద్ధరించే వరకు ఢిల్లీ వీధుల నుంచి గ్రామ స్థాయి వరకు ఈ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కరెంట్ కోతలను అరికట్టాలి...అదనపు కలెక్టర్‌కు వినతి

- రైతు సంగం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు



సంగారెడ్డి అక్టోబర్ 12 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లాలో కరెంట్ కోతలను వెంటనే అరికట్టాలని తెలంగాణ రైతు సంగం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రైతుసంగం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సంగీతకి, కార్యాలయంలో ఇంచార్జ్ యస్. ఓ .వీరస్వామి కి వినతి పత్రం ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో కరెంట్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే కరెంట్ కోతలను అరికట్టి పూర్తి స్థాయిలో కరెంట్ ఇవ్వాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వరి పంట ఎండిపోతుందని అన్నారు. తక్షణం లోవోల్టేజ్ కరెంటు కోతలు అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం రైతు సంగం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, నాయకులు నర్సింగ్ రావు,శ్రీనివాస్, రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మూలమల్ల గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించండి

- ప్రజావాణిలో ఫిర్యాదు




ఆత్మకూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి): ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామానికి బీటీ రహదారిని నిర్మించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ రంగారెడ్డి, గ్రామ ప్రజలు ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరామ్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. మూలమల్ల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారిందని, వర్షాకాలంలో బురదమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా గ్రామంలోకి రాలేని పరిస్థితి ఉందని, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ రంగారెడ్డి తెలిపారు. వెంటనే స్పందించి మూలమల్ల గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయ కులు షరీఫ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు,

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు - మున్సిపల్ చైర్మన్ జి.నాగమణి



ఆత్మకూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి): పేదల సొంతింటి కలలు నెరవేర్చే ప్రభుత్వం కృషి చేస్తుందని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మునిసిపల్ చైర్మన్ జి నాగమణి, వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు తెలిపారు, ఈ సందర్భంగా సోమవారం 9 వార్డులో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు తులసి వెంకట రాములు, డి శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తులసి రాజు యాదవ్, మహేష్, వార్డ్ ఆఫీసర్ డి. మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారి దర్శనం



వెల్దండ, అక్టోబర్ 12 (జనంసాక్షి): వెల్దండ బుధపేట ఆంజనేయస్వామి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బొల్లంపల్లి కృష్ణ, కార్యదర్శి పాలాది సంతోష్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ముఖ్య అతిథులను శాలువాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కేసు నమోదు



ఉప్పునుంతల (జనంసాక్షి): అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఉప్పునుంతల ఎస్సై పి. మహేష్ హెచ్చరించారు. మండలంలోని దాసర్లపల్లి గ్రామంలో అనుమతులు లేకుండా ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తున్న షేక్ బురాన్‌ను పోలీసులు గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వడం, రవాణా చేయడం, నిల్వ చేయడం నేరమని స్పష్టం చేశారు. అక్రమ కార్యకలాపాలపై పోలీసుల నిఘా కొనసాగుతుందని, ఇలాంటి ఘటనల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం

- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి






**కల్వకుర్తి, అక్టోబర్12 (జనంసాక్షి):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూఢిల్లీలో నిర్వహించిన ధర్నాలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు ఎన్నికల కమిషన్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ ధర్నాలో అచ్చంపేట ఎమ్మెల్యేడాక్టర్ వంశీ కృష్ణతో పాటు రాష్ట్రానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు,మంత్రులు పాల్గొని నిరసనవ్యక్తం చేశారు.

# త్రిముఖ దుర్గాదేవి అలంకరణ



**అచ్చంపేట అక్టోబర్ 12 (జనంసాక్షి):** పతనం శ్రీ చక్ర సహిత శ్రీ వాసవి అమ్మవారి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారిని శ్రీ త్రిముఖ దుర్గాదేవి రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తి వాతావరణం నెలకొంది.

## పాత పైప్‌లైన్‌కు

# వెంటనే మరమ్మతులు చేపట్టాలి



**మక్తల్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా పాత పైప్‌లైన్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రాజయ్య, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆల్కూరి రవికుమార్ సూచించారు. ప్రధాన రహదారి నుంచి ఆజాద్‌నగర్ చౌరస్తా వరకు జరుగుతున్న పైప్‌లైన్ పనులను వారు పరిశీలించారు. లీకేజీలతో నీటి సరఫరాకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొత్త నీటి ట్యాంకులకు అనుసంధానంగా 350 ఎంఎం పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు.

## గాయత్రీ దేవిగా

# భక్తులకు దర్శనం ఇచ్చిన వాసవి మాత



**మల్దకల్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారంమల్దకల్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నవరాత్రి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలలో గాయత్రి హోమాన్ని చైతన్య వేదమంత్రాలతో నిర్వహించారు. అమ్మవారి అలంకార సేవ అర్చనలు కైంకర్యాలు అర్చకులు రవి ప్రద్యుమ్న నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రీ దేవిగా ప్రత్యేక పూజలు నిర్వహించిన దాతలు పల్లా నరసింహయ్య,నాగరదొడ్డి రాఘవేంద్ర గుప్తా గట్టు ఆధ్వర్యంలో జరిగాయి. సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించగా అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# ధన్‌ధాన్య కృషి యోజనలో కలెక్టర్‌కు ఉత్తమ అవార్డు

## న్యూఢిల్లీలో వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ ప్రియాంక




**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 12(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా లో ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన కార్యక్రమం అమలులో విశిష్ట సేవలు అందించినందుకు జిల్లా కలెక్టర్ ప్రియాంక సోమవారం న్యూఢిల్లీలో వ్యవ సాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలులో జిల్లా యంత్రాంగం చేసిన కృషికి ఈ గుర్తింపు లభించడం విశేషం.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజ నాలు అందించడం, వ్యవ సాయ సంబంధిత కార్యక్ర మాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాల్లో అధికారులు అంకితభా వంతో పనిచేయడం అభి నందనీయమని పేర్కొ న్నారు. జిల్లాలో వ్యవసా య రంగానికి సంబంధిం చిన అభివృద్ధి కార్యక్రమా లను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ, సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ అవార్డు సాధనలో భాగస్వాములైన జిల్లా అధికారులందరికీ, వారి బృందాలకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినం దనలు తెలిపారు. ప్రతి ఒక్కరి సహకారం, కృషి, బాధ్యతాయుతమైన పనితీరు ఈ విజయానికి పునాది అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే బృంద స్ఫూర్తిని కొనసా గిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు జిల్లా అభివృద్ధిలో మరిన్ని మైలురాళ్లను సాధించాలని ఆకాంక్షిం చారు.నారాయణపేట జిల్లాకు లభించిన ఈ గుర్తింపు జిల్లా యంత్రాంగా నికి మరింత బాధ్యతను పెంచిందని, రానున్న రోజు ల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ అవార్డు ప్రేరణగా నిలుస్తుం దని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## కాత్యాయిని దేవి

# అలంకరణలో వాసవి మాత



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 12(జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో 56వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం వాసవి మాత కాత్యాయిని దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు జోషి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, వివిధ హోమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం పుష్పార్చన, హారతి, పల్లకీసేవతో పాటు శివపార్వతుల కల్యాణం నిర్వహించగా భక్తులను ఆకట్టుకుంది.

# బీసీ రిజర్వేషన్ల హామీని విస్మరించిన ప్రభుత్వం



**జడ్చర్ల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ విమర్శించారు. జడ్చర్లలో ప్రజా సంఘాల సమావేశంలో మాట్లాడుతూ, స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 17 శాతానికి పరిమితం చేయడం అన్యాయమన్నారు. జనాభా గణనలో బీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి, జనాభా దామాషా ప్రకారం చట్టబద్ధ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం..

- గర్భిణులకు పాలు, గుడ్ల పంపిణీ



**మహమ్మదాబాద్ (జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులకు పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాణిక్యమ్మ మాట్లాడుతూ గర్భిణులు తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పాలు, గుడ్లు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, తాజా పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. ఐరన్, కాల్షియం, ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే ఆహారం శిశువు ఎదుగుదలకు తోడ్పడుతుందని తెలిపారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ సవిత, గర్భిణులు పాల్గొన్నారు.

# జూరాల ఆయకట్టుకు నిరంతర సాగునీరు అందించాలి



**గద్వాల, అక్టోబర్ 12 (జనంసాక్షి):** జూరాల ఆయకట్టు భూములకు పంటలు చేతికొచ్చే వరకు నిరంతరాయంగా సాగునీరు విడుదల చేయాలని తెలంగాణ రైతాంగ సమితి డిమాండ్ చేసింది. గద్వాల టీజేఎస్ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య మాట్లాడుతూ, నీటి నిలిపివేతతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని నీటి విడుదలపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాల్వల చివరి భూములకు నీరందించాలని, అవసరమైతే జూరాల ప్రాజెక్టు ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గిరిజన సేవా సంఘం

# ప్రధాన కార్యదర్శిగా టిక్యా నాయక్



**వనపర్తి రూరల్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా గిరిజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శిగా పెద్దగూడెం తండాకు చెందిన టిక్యా నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తన నివాసంలో ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల హక్కుల పరిరక్షణతో పాటు విద్య, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి నూతన ప్రధాన కార్యదర్శి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# రాజగోపుర, గరుడస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



**మక్తల్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** పడమటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో జరుగుతున్న రాజగోపుర నిర్మాణ పనుల్లో భాగంగా, గరుడస్తంభ ప్రతిష్ఠాపన, కడప రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు అంబరాన్ని అంటేలా ప్రారంభమయ్యాయి. సోమవారం స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం నుండి నంది కోలాటం, కుర్వ డోలు, మంగళ వాయిద్యాల నూతన వాయిద్య హోరున వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్ర వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి బయలుదేరి ప్రధాన వీధుల మీదుగా శ్రీ పడమటి ఆంజనేయ స్వామి వారి దేవస్థానం వరకు భక్తుల కోలాహలం మధ్య అత్యంత నేత్రపర్వంగా సాగింది. ఈ నెల 14వ తేదీ ఉదయం 08:26 నిమిషములకు పవిత్ర గరుడ స్తంభ ప్రతిష్ఠాపన, కడప రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆలయ అధికారులు, నిర్వాహకులు సవినయంగా కోరారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు...

## భూ రీసర్వేకు మండలానికి రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలి: అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

**వనపర్తి, బ్యూరో అక్టోబర్ 12 (జనం సాక్షి):** జిల్లాలో రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించి, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు.
సోమవారం వనపర్తి జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యంతో కలిసి తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం, భూ రీసర్వే పనుల పురోగతి, పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు.

**ప్రతి మండలంలో రెండు బృందాలు...**

భూ రీసర్వే పనులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి మండలంలో రెండు ప్రత్యేక బృందాలను తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి బృందంలో డిప్యూటీ తహసీల్దార్ పర్యవేక్షణలో లైసెన్స్‌డ్ సర్వేయర్, జీపీవో ఉండాలని,



రెండో బృందంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లేదా సీనియర్ అసిస్టెంట్ పర్యవేక్షణలో లైసెన్స్‌డ్ సర్వేయర్, జీపీవో ఉండాలని సూచించారు. బృందాల్లోని సభ్యులందరికీ రీ-సర్వే విధివిధానాలపై పూర్తిస్థాయి శిక్షణ వెంటనే అందించాలని పేర్కొన్నారు.

**22ఏ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి...**

నిషేధిత భూముల జాబితా (22ఏ)కు సంబంధించి టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని సూచించారు.
భూభారతి పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చిన నూతన మాడ్యూల్ ద్వారా దరఖాస్తుదారులు తమకు సంబంధించిన వివిధ సమస్యలను ఒకే దరఖాస్తు ద్వారా తెలియజేయవచ్చని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ



సౌకర్యంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, భూభారతి సేవలను సులభంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.
అదేవిధంగా ఎస్ఐఆర్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నోటీసుల ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, సంబంధిత ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో ఆర్డీఓ, ఏడీఎస్ఎల్ఆర్, జిల్లాలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఈవీ మోటార్స్ షోరూంను ప్రారంభించిన ఎంపీ డీకే అరుణ



**ఆత్మకూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో సోమవారం ఆరేపల్లి బీజేపీ గ్రామ అధ్యక్షుడు బలీయర్ నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ వెంకటేశ్వర ఈవీ మోటార్స్ అండ్ సర్వీస్ పాయింట్ను పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ ఘనంగా ప్రారంభించారు. పెరుగుతున్న పెట్రోల్ ధరలు, వాయు కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలని ఎంపీ అరుణమ్మ పేర్కొన్నారు. ఈవీ వాహనాలు భవిష్యత్తు అవసరమని తెలిపారు. ఇలాంటి నూతన సంస్థల ఏర్పాటు వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఆత్మకూరు ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, ఆత్మకూరు మండల బీజేపీ నాయకులు ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్, జిందే శ్రీనివాసులు, ఆంజనేయులు, బలీయర్ స్నేహితులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ం

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- **రూరల్ ఎస్ఐ సతీష్ రెడ్డి**



**నారాయణపేట అక్టోబర్ 12(జనంసాక్షి):** నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు రూరల్ ఎస్సై ఎస్.సతీష్ రెడ్డి తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి పేకాటకు సంబంధించిన నగదు రూ. 5,420తో పాటు ఐదు సెల్‌ఫోన్లను, పెకముక్క లను స్వాధీనం చేసుకొని గేమింగ్ యాక్ట్ ప్రకారం ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపా లపై ప్రజలకు ఏవైనా సమా చారం తెలిస్తే వెంటనే లోక ల్ పోలీసులకు తెలియజే యాలనీ కోరారు.

## మాజీ సర్పంచ్‌కు బిల్లుల చెల్లింపునకు డీపీఓ ఆదేశాలు




**అచ్చంపేట, అక్టోబర్ 12 (జనంసాక్షి):**
అమ్రాబాద్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ దుమావత్ శ్రావణి శ్రీనుకు పెండింగ్ బిల్లుల చెల్లింపులపై నాగర్‌కర్నూల్ జిల్లా పంచాయతీ అధికారి కీలక ఆదేశాలు జారీ చేశారు. 2019-2024 మధ్య సర్పంచ్‌గా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆమె ఫిర్యాదు చేశారు.
ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన అధికారులు బిల్లులు, కొలతల పుస్తకాలు (ఎం.బి.), ఇతర రికార్డులను పరిశీలించారు. సాంకేతిక అధికారుల నివేదికలు, పంచాయతీ అధికారుల వివరణలను పరిగణనలోకి తీసుకున్నారు. నిబంధనల ప్రకారం అర్హమైన బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డీపీఓ ఆదేశించారు. గ్రామపంచాయతీ నిధుల లభ్యతను పరిగణనలోకి తీసుకొని చెల్లింపులు చేపట్టాలన్నారు. చెక్కులపై సంయుక్త సంతకాలు చేసే అధికారాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి కల్పించారు. చెల్లింపుల ప్రక్రియను ఐదు రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ప్రత్యామ్నాయ పంటలు ఎంచుకోండి: అదనపు కలెక్టర్ శ్రీను



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి):** వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీను సూచించారు. సింగారం రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు ఎంచుకుని తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందాలని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టాలు సగటున నాలుగు మీటర్లు తగ్గాయని పేర్కొన్నారు. వరికి బదులుగా కంది, పెసర, మినుములు, శనగలు, వేరుశనగ, సూర్యకాంతి, జొన్న, మొక్కజొన్న సాగు చేయాలని సూచించారు. జిల్లాలోని 38 రైతు వేదికల్లో జరిగిన సమావేశాల్లో 4,500 మంది రైతులు, 250 మంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు. సహజ వ్యవసాయం, నీటి సంరక్షణతో వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని కోరారు.

## హోరాహోరీగా రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు



**నారాయణపేట, అక్టోబర్ 12 (జనంసాక్షి):** దామరగిద్ద మండలం కానుకుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 70వ ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి పది జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. బరువు విభాగాల ఆధారంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి, రెజ్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ గ్రహీత పరిపూర్ణానికి ఘన సన్మానం



**బిజినేపల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి):** పత్రికారంగంలో 18 ఏళ్లుగా విశిష్ట సేవలందించి డాక్టరేట్ పొందిన నవతెలంగాణ ఉమ్మడి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పరిపూర్ణాన్ని బిజినేపల్లి తెలుగు మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మత్స్యకార నాయకుడు భయ్యా వెంకటస్వామి బీసీల ఐక్యతతో హక్కుల సాధనకు, బీసీ ముఖ్యమంత్రి కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

## తెలకపల్లి బీజేపీలో ఆరు మోర్చాలకు అధ్యక్షుల నియామకం



**తెలకపల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి):**
తెలకపల్లి బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఆరు మోర్చాలకు నూతన అధ్యక్షులను నియమించారు. ఓబీసీ మోర్చాకు సూర్య మధుసూదన్ గౌడ్, యువ మోర్చాకు సూర్య భాస్కర్ గౌడ్, ఎస్సీ మోర్చాకు తగిలి పరుశరామ్, కిసాన్ మోర్చాకు గుర్రం ఆంజనేయులు రెడ్డి, మహిళా మోర్చాకు కౌకుంట్ల అనిత భాస్కర్ గౌడ్, మైనారిటీ మోర్చాకు మహమ్మద్ ఖాదర్ నియమితులయ్యారు. ముఖ్య అతిథి కేవీ రమణ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి పదవులు పొందిన నాయకులను సన్మానించారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బతుకమ్మ పాట..

### షూటింగ్ ప్రారంభం



**మక్తల్, అక్టోబర్ 12 (జనంసాక్షి):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మక్తల్ పరిసరాల్లో రూపొందిస్తున్న నూతన బతుకమ్మ పాట షూటింగ్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. మక్తల్‌కు చెందిన జెమిని రవి, సురేందర్, రాజు, కుర్వ శంకర్ ఆధ్వర్యంలో ఈ గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. బతుకమ్మ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మమేకమైన సంప్రదాయాలకు ప్రతీక అని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి పాటలతో తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించవచ్చన్నారు. కాంగ్రెస్ నాయకులు సురేష్ కుమార్ గుప్తా, గణేష్ కుమార్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



మల్దకల్, అక్టోబర్ 12 (జనం సాక్షి): మండలంలోని దాసరి పల్లి, ఉలిగేపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు విడతల వారీగా రూ.5 లక్షలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇల్లు మంజూరు కానివారు ఆందోళన చెందవద్దని, రెండో విడతలో అర్హులకు ఇళ్లు మంజూరు చేసేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి




సూర్యాపేట (జనంసాక్షి): వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని సూర్యాపేట మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైదరాబాదీ అమృత తుల్య కేఫ్ ఫ్రాంచైజ్ ని ఆమె ప్రారంభించి మాట్లాడారు.వినియోగదారులకు ఉత్తమ సేవలను అందించి వ్యాపారంలో రాణించాలని ఆకాంక్షించారు.యువత స్వశక్తితో ఎదిగి ఆదర్శంగా నిలవాలని అన్నారు.అనంతరం నిర్వాహకులు ఉపేందర్ రజిత మాట్లాడుతూ హైదరాబాదీ అమృత తుల్య కేఫ్ లో అందించే సేవలను వినియోగించుకుని తమను ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జ్యోతి శ్రీవిద్య కరుణాకర్, నిమ్మల కీర్తి లవన్ గౌడ్, గుణగంటి హేమ సతీష్, రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు, అనంతుల ప్రకాష్, దామోదర్, ఉదయ్, శ్రీను, పురుషోత్తం, లింగయ్య, వెంకటమధు తదితరులు పాల్గొన్నారు.

# వెట్టిచాకిరీ నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలి

- స్వేచ్ఛా రథం ప్రచార వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్

మహబూబ్ నగర్ బ్యూరో అక్టోబర్ 12(జనంసాక్షి): వెట్టిచాకిరీ నిర్మూలన, కార్మికుల హక్కుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వెట్టిచాకిరీకి గురవుతున్న చేయండి కార్మికులను గుర్తించి, వారికి విముక్తి కల్పించడంతో పాటు తగిన పునరావాసం అందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీల వంటి అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితులను పరిశీలిస్తూ,



వెట్టిచాకిరీ బాధితులను గుర్తించడంలో సంబంధిత శాఖల అధికారులు చురుగ్గా వ్యవహరించాలని పేర్కొన్నారు. 'స్వేచ్ఛా రథం' జిల్లావ్యాప్తంగా పర్యటిస్తూ వెట్టిచాకిరీ నిర్మూలన, కార్మికుల హక్కులు, కార్మికులపై జరిగే దోపిడీని అరికట్టే మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించనుంది. సమాచార, విద్య, ప్రచార సామగ్రి ద్వారా కార్మికులకు చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ రక్షణ వ్యవస్థలపై చైతన్యం కల్పించనున్నారు.



వెట్టిచాకిరీ లేదా కార్మికుల దోపిడీకి సంబంధించిన సమాచారం అందించేందుకు, సహాయం పొందేందుకు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 080-69434343 ను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఈ ప్రచార కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సాయి శివానీ,కార్మిక శాఖ ఇంచార్జి అసిస్టెంట్ కమిషనర్ మహమ్మద్ అల్తాఫ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా, వివిధ అధికారులు పాల్గొన్నారు.

## సుగుణ ఎదుట గ్రామస్థులు రైతుల ఆందోళన



శివ్వంపేట, అక్టోబరు 12 (జనంసాక్షి): రైతులు పండించిన మక్క లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శివ్వంపేట మండలం శబాష్ పల్లి గ్రామ పరిధిలోని సుగుణ ఫీడ్ మిల్ ముందు సోమవారం సర్పంచ్ అయ్యగారి యాదగిరి, రైతులు గ్రామస్థులతో కలిసి పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. రైతుల ధర్నాను ఉద్దేశించి సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ ప్రస్తుతం వాతావర ణం నెలకొన్న మార్పుల వల్ల ఎల్నినో ప్రభావంతో రైతులు పండిం చిన మక్కలు చిన్న గా ఉన్నాయని, రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాలని కోరడం తప్ప అని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటనపై నిర సన వ్యక్తం చేస్తూ సర్పంచ్, గ్రామస్థులు సుమారు రెండు గంటల పాటు పరిశ్రమ ఎదుట కూర్చొని ఆందోళన నిర్వహించారు. మంగళవారం పరిశ్రమ యజమానితో క్షమా పణ చెప్పిస్తానని చెప్పడంతో ఆందోళన విరమించినట్లు సర్పంచ్ తెలిపారు. ఆందోళనలో గ్రామస్తులు, రైతులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

## అపోలో ఫార్మసీలో ఉద్యోగ అవకాశాలు



- జిల్లా ఉపాధి అధికారి ఎం.రాధిక
- అర్హతను బట్టి రూ.25 వేల వరకు వేతనం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12 (జనంసాక్షి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీలో ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, అప్రెంటిస్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మేడ్చల్ జిల్లా ఉపాధి అధికారి ఎం.రాధిక తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు వారి విద్యార్హతలు, పని అనుభవాన్ని బట్టి నెలకు రూ.12,500 నుంచి రూ.25,000 వరకు సీటీసీ వేతనం అందించనున్నట్లు రాధిక పేర్కొన్నారు. అదనంగా పీఎఫ్, ఈఎస్ఐ, నెలవారీ ప్రోత్సాహకాలు, వార్షిక బోనస్, వార్షిక వేతన పెంపుతోపాటు వారాంతపు సెలవులు, సాధారణ సెలవులు, అనారోగ్య సెలవులు, ఆర్జిత సెలవులు, యూనిఫాం వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పురుష అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు. షామీర్‌పేటలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్న జిల్లా ఉపాధి శాఖ కార్యాలయంలో ఈ నెల 14న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఉపాధి శాఖ అధికారి రాధిక తెలిపారు. జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువత అవసరమైన వివరాలతో ఇంటర్వ్యూకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం జిల్లా ఉపాధి శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## సూర్యాపేట మార్కెట్‌ను ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దుతాం

- రైతులకు మెరుగైన ధరలు, కార్మికుల అభివృద్ధికి ప్రాధాన్యం: చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



సూర్యాపేట (జనంసాక్షి): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌ను రైతులకు మరింత చేరువ చేసి, రాష్ట్రంలోనే ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారం, మార్గదర్శకత్వంలో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

సోమవారం సూర్యాపేట నూతన వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతన గాల్‌వాల్యూమ్ షెడ్ల నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన ధరలు లభించేలా చర్యలు తీసుకుంటామని, రైతుల సంక్షేమమే మార్కెట్ కమిటీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

మార్కెట్ యార్డులో పనిచేస్తున్న హమాలీ కార్మికుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. మార్కెట్ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని, వారి సంక్షేమాన్ని విస్మరించబోమని పేర్కొన్నారు. రైతులు, కార్మికులు, వ్యాపారులకు అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నారు.

నూతన గాల్‌వాల్యూమ్ షెడ్ల నిర్మాణం మార్కెట్‌లో సౌకర్యాల పెంపునకు దోహదపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ ఉల్లా, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎండీ ఫసియొద్దీన్, పాలకవర్గ సభ్యులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, హమాలీ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠకు తీర్మానం



వనపర్తి, అక్టోబర్ 12 (జనంసాక్షి): వనపర్తి పట్టణంలో ఆతుకూరి మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయించడంపై కుమ్మరి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు సూగూరు రాము ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కుమ్మరి వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. కుమ్మరి వృత్తికి ప్రధాన ఆధారమైన మట్టి లభ్యత తగ్గడంతో వృత్తిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వనపర్తి పట్టణం, మండల పరిధిలో మట్టి లభించే కుంటలు, చెరువులను గుర్తించి ఉచితంగా మట్టి అందించాలని, రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. వృత్తి నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక క్లస్టర్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తరతరాలుగా కులవృత్తిపై ఆధారపడిన కుమ్మరి కుటుంబాల జీవనోపాధికి సహకరించాలని కోరారు. విగ్రహ ప్రతిష్ఠకు తీర్మానం చేయడంతోపాటు తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లాలోని 15 మండలాలకు చెందిన కుమ్మరి సంఘం నాయకులు, మాతృసంఘం, స్టీరింగ్ కమిటీ, పొలిటికల్ కన్వీనింగ్ కమిటీ, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రైతు వేదికల్లో ఎదురుచూపులే.. రైతులకు నిరాశే!

- ఎల్‌నినోపై సీఎం వీడియో కాన్ఫరెన్స్ ప్రకటనతో రైతుల రాక..చివరకు నిరాశే
- సీఎం గోవా పర్యటన..మంత్రులు ఢిల్లీ బాట..పంటలు ఎండుతున్నా పట్టింపు లేదా?
- మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు



మహమ్మదాబాద్,అక్టోబర్ 12 (జనంసాక్షి): ఓవైపు వర్షాభావం.. మరో వైపు విద్యుత్ అంతరాయాలు.. ఎండిపోతున్న పంటలతో రైతులు ఆందోళన చెందుతుంటే, వారిలో భరోసా నింపాల్సిన ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతోందని మాజీ జెడ్పీటీసీ,ఎం.శ్రీనివాస్‌రెడ్డి,బీఆర్ఎస్ పార్టీ నేతలు విమర్శించారు.ఎల్‌నినో పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారన్న సమాచారంతో ఉమ్మడి గండీడ్ మండలంలోని రైతులు, సర్పంచులు రైతు వేదికలకు చేరుకున్నారని, అయితే సీఎం గోవా పర్యటనలో,మంత్రులు ఢిల్లీ పర్యటనలో ఉన్నా రన్న విషయం తెలిసి నిరాశతో వెనుదిరిగారని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొన్నాయి.

**రైతుల ఎదురుచూపులు.. ప్రభుత్వ ప్రకటనలకే పరిమితమా?**

పంటలు ఎండిపోతున్నాయని,సాగుకు సరిపడా విద్యుత్ అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో వారికి తక్షణ భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతులకు క్షేత్రస్థాయిలో భరోసా కల్పించి,వారి సమస్యలకు పరిష్కారం చూపాలని శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మహబూబ్‌నగర్‌లో 26 ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు

• జిల్లా విద్యాశాఖ, ఫ్యూచర్ రెడీనెస్ సంస్థ మధ్య ఎంఓయూ

మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి): మహబూబ్‌నగర్ జిల్లాలో ఎంపిక చేసిన 26 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆంగ్ల భాషలో మాట్లాడే సామర్థ్యం, ఆత్మ విశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ రెడీనెస్ సంస్థ మధ్య సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను స్వయంగా ఎదుర్కొని, సమస్యలకు పరిష్కారాలు కనుగొనే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

అక్టోబర్ చివరి వారం, నవంబర్ నెలలో ఎంపిక చేసిన పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం నాలుగు ప్రధాన అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తారు. యంగ్ ఒరేటర్స్ క్లబ్ ద్వారా తరగతి గదుల్లో, సభా వేదికలపై స్పష్టంగా, ధైర్యంగా మాట్లాడే నైపుణ్యాలను నేర్పిస్తారు. థింక్ అండ్ మేక్ కార్యక్రమంలో సమస్యలను గుర్తించడం, ప్రయోగాలు చేయడం, పరిష్కారాలను స్వయంగా కనుగొనడం



వంటి నైపుణ్యాలను పెంపొందిస్తారు. మనీ మ్యాటర్స్ ద్వారా సంపాదన, ఖర్చులు, పొదుపు, బ్యాంకింగ్‌పై ప్రాథమిక ఆర్థిక అవగాహన కల్పిస్తారు. కెరీర్ అవేర్‌నెస్ కార్యక్రమం ద్వారా ఉన్నత విద్యలోని కోర్సులు, భవిష్యత్తులో ఎంచుకోదగిన వృత్తులపై అవగాహన కల్పిస్తారు.

కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ విద్యార్థులు శిక్షణకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ రెడీనెస్ ప్రతినిధులు కీర్తన, సంతోష్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుడి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



గద్వాల, అక్టోబర్ 12 (జనంసాక్షి): గద్వాల జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్రూమ్ కాలనీలో లబ్ధిదారుడు పరశురాముడు నిర్వహించిన గృహప్రవేశానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని, కుటుంబసభ్యులకు నూతన వస్త్రాలు, కానుకలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కేశవ్ జయలక్ష్మి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో రైతు ప్రహ్లాద రెడ్డికి పురస్కారం



గద్వాల, అక్టోబర్ 12 (జనంసాక్షి): అయిజ మండలం ఉప్పల గ్రామానికి చెందిన రైతు ప్రహ్లాద రెడ్డికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన అమలులో పురోగతి సాధించిన దేశవ్యాప్తంగా ఎంపికైన 100 మంది రైతుల్లో ఆయన చోటు దక్కించుకున్నారు. రసాయన ఎరువులకు దూరంగా సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నందుకు ఢిల్లీలోని నేషనల్ అగ్రికల్చర్ సైన్స్ కాంప్లెక్స్‌లో అవార్డు అందుకున్నారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచిన ఆయనను గ్రామస్థులు, రైతులు అభినందించారు.

## పంచాయతీ కార్యదర్శి నిర్ణయాలపై విచారణ జరిపించాలి



మఖ్తల్, అక్టోబర్ 12 (జనంసాక్షి): మఖ్తల్ మండలం కర్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏకపక్ష నిర్ణయాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాఘవేందర్ గౌడ్ ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. తాను కొనుగోలు చేసిన ఇంటి (నంబర్ 6/46) పత్రాలను పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయాలని కోరినా కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. అధికారిక ఉత్తర్వులు, నిబంధనలు పాటించకుండా అనుమతి పత్రం ఆధారంగా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై 2026 జూన్ 29న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

## గట్టు ఎత్తిపోతలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: రంజిత్ కుమార్




గద్వాల, అక్టోబర్ 12 (జనంసాక్షి): గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం గద్వాలలో ఆయన మాట్లాడుతూ, అంచనాలు పెంచుతూ జీవోలు మారుస్తున్నా రైతులకు నీరు అందడం లేదని విమర్శించారు. జూరాల నీటి కేటాయింపులపై స్పష్టతనిస్తూ శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించి నిధులపై ప్రకటన చేయాలని కోరారు. నిర్లక్ష్యం కొనసాగితే నడిగడ్డ రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## వ్యాపారులతో ప్రభుత్వ ఆదాయానికి గండి: తెలుగు సత్తయ్య




జడ్చర్ల, అక్టోబర్ 12 (జనంసాక్షి): జడ్చర్ల తహశీల్దార్ కార్యాలయం పక్కన టీఎన్జీవో భవనంలోని దుకాణాల ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య ఆరోపించారు. సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఆయన, 26 ఏళ్లుగా కొందరు వ్యాపారులు తక్కువ అద్దెలతో దుకాణాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మార్కెట్‌లో ఒక్కో దుకాణానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అద్దె ఉండగా, ప్రభుత్వానికి నామమాత్రపు అద్దె చెల్లిస్తున్నారని విమర్శించారు. దుకాణాలను ఖాళీ చేయించి బహిరంగ వేలం నిర్వహించాలని, తహశీల్దార్ కార్యాలయంలో మరుగుదొడ్లు, కుర్చీలు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

## జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా మంజునాథ్



మక్తల్, అక్టోబర్ 12 (జనంసాక్షి): నారాయణపేట జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా ఆర్. మంజునాథ్ నియమితులయ్యారు. ఆర్ఎస్ఎస్ సేవకుడిగా, ఏబీవీపీ మక్తల్ నియోజకవర్గ భాగ్ కన్వీనర్‌గా విద్యార్థి సమస్యలపై పోరాడిన ఆయన, గత మూడేళ్లుగా జిల్లా కార్యదర్శిగా సేవలందించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే, జిల్లా అధ్యక్షుడు ఎం. భరత్ కుమార్, బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. యువత, విద్యార్థి ఉద్యమాలను బలోపేతం చేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## గౌతాపూర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మరమ్మతులు



బాలానగర్, అక్టోబర్ 12 (జనంసాక్షి): బాలానగర్ మండలం గౌతాపూర్ గ్రామంలో ఐదు, ఆరు, ఏడు వార్డుల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు ప్రారంభించారు. మురుగునీటి సమస్యలను గుర్తించిన ఆరో వార్డు సభ్యుడు పెద్దోని ప్రదీప్ కుమార్, ఏడో వార్డు సభ్యుడు పెద్దోని రామకృష్ణ పనుల ప్రారంభానికి చొరవ చూపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మరమ్మతులతో మురుగునీరు నిల్వ ఉండకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టారు. పనులు పూర్తయితే స్థానికులకు ఇబ్బందులు తగ్గడంతోపాటు పారిశుధ్యం మెరుగుపడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

ఏవైనా కారణాలతో అర్జీలను పరిష్కరించడం సాధ్యం కాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని లేదా నిబంధనల ప్రకారం పరిష్కారం సాధ్యం కాని కారణాలను ఫిర్యాదుదారులకు స్పష్టంగా వివరించాలని తెలిపారు. దరఖాస్తులను కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉంచరాదని, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చిన పెండింగ్ అర్జీలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

సోమవారం జిల్లా ప్రజావాణిలో 45 దరఖాస్తులు, ఆర్డీవో కార్యాలయ ప్రజావాణిలో మరో నాలుగు దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, జెడ్పీ సీఈవో యాదయ్య, ట్రైనీ అదనపు కలెక్టర్లు రంజిత్ రెడ్డి, శ్రావ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు త్వరగా నిర్మించుకోవాలి



కృష్ణ, అక్టోబర్ 12, (జనంసాక్షి): కృష్ణ మండలంలో, మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని ఎంపీడీఓ కిషోర్ లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం ఇళ్లు లేని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు.అందులో భాగంగా మండలంలోని ఖాన్ దొడ్డి 11,మురర్ దొడ్డి 3, గుడే బల్లూరు 2, కున్సీ 1, ముడుమాల్ 1, తంగిడిగి –4 మొత్తం 22 మంది లబ్ధిదారులకు ప్రొసిడింగ్సను మండల పరిషత్ కార్యాలయంలో వీరికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలిపాటేల్ విజయప్పగౌడ్ ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వివిధ పార్టీ నాయకులు, తదితరులు, అధికారులు, పాల్గొన్నారు.

## నార్లపూర్ పంపు ప్రారంభించి రైతులను ఆదుకోవాలి

శ్రీశైలంలో నీటి లభ్యత ఉన్నా తెలంగాణ రైతులకు సాగునీరు అందించకుండా ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని విమర్శించారు. పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, మల్యాల, వెలిగొండ మార్గాల ద్వారా సుమారు 100 టీఎంసీల కృష్ణా జలాలు తరలిపోయాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించిన నిరంజన్‌రెడ్డి, కేఎల్ఐ పంపులను పూర్తిస్థాయిలో నడిపించాలని, నార్లపూర్‌లో కనీసం ఒక పంపునైనా వెంటనే ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల తరఫున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.